# బలగం TV

BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 29 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## 13 మంది ఐపీఎస్‌లు బదిలీ..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మళ్లీ ఐఏఎస్ ఆఫీసర్ల బదిలీలు జరిగాయి. ఈసారి 13 మంది ఐఏఎస్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణ రెడ్డి, నల్లగొండ కలెక్టర్‌గా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా హనుమంతరావు, పురపాలక శాఖ సంచాలకులుగా టీకే శ్రీదేవి, సీసీఎల్‌ఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా మందా మకరందు, పర్యాటక శాఖ సంచాలకులుగా జెడ్ కే హనుమంతు, దేవాదాయ శాఖ సంచాలకులుగా హనుమంతకు అదనపు బాధ్యతలు, ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్‌గా ఎస్ హరీశ్, విపత్తు నిర్వహణ శాఖ సంయుక్త కార్యదర్శి హరీశ్‌కు అదనపు బాధ్యతలు, ఆర్ అండ్ ఆర్, భూసేకరణ కమిషనర్‌గా వినయ్ కృష్ణా రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు, డెయిరీ కార్పొరేషన్ ఎండీగా కే చంద్రశేఖర్ రెడ్డి, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్ దిలీప్ కుమార్ నియమితులయ్యారు.



## విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదన తిరస్కరణ

- స్థిర చార్జీలు రూ.10 యధాతథం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) రాష్ట్రంలోని సామాన్య వినియోగదారులకు భారీ ఊరటనిచ్చింది. కరెంట్ బిల్లు పెంపు ప్రతిపాదనను సోమవారం ఈఆర్‌సీ తిరస్కరించింది. 800 యూనిట్లు దాటితే ఫిక్స్‌డ్ చార్జీలు రూ.10 నుంచి రూ.50 పెంచేందుకు అనుమతులు ఇవ్వాలని డిస్కమ్ లు ప్రతిపాదించాయి. సుదీర్ఘ చర్చల తర్వాత, ఈఆర్‌సీ డిస్కమ్‌ల ప్రతిపాదనను తిరస్కరించింది.

డిస్కంల 8 పిటిషన్లపై కమిషన్ తన అభిప్రాయాలను వెల్లడించిందని ఈఆర్సీ ఛైర్మన్ శ్రీరంగారావు తెలిపారు. అన్ని పిటిషన్లపై ఎలాంటి లాప్స్ లేకుండా వెల్లడించాలని ఈఆర్సీ నిర్ణయించిందని శ్రీరంగారావు తెలిపారు. 40 రోజుల తక్కువ సమయంలో నిర్ణయం వెలువరిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిగతులు, వినియోగదారులు, ప్రభుత్వ సబ్సిడీ దృష్టిలో పెట్టుకొని కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. విద్యుత్ ఛార్జీలు ఏ కేటగిరిగిలో కూడా పెంచడం లేదని శ్రీరంగారావు స్పష్టం చేశారు. ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ.10 యధాతథంగా ఉంటాయని క్లారిటీ ఇచ్చారు. పౌల్ట్రీ ఫాం, గోట్ ఫాంలను కూడా కమిషన్ ఆమోదించలేదన్నారు. హెచ్‌టీ కేటగిరిలో ప్రతిపాదనలు రిజక్ట్ చేశామని శ్రీరంగారావు చెప్పుకొచ్చారు.

132 కేవీఏ, 133 కేవీఏ, 11కేవీలలో గతంలో మాదిరిగానే ఛార్జీలు ఉంటాయని శ్రీరంగారావు తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్‌కు కమిషన్ ఆమోదించిందన్నారు. టైమ్ ఆఫ్ డేలో పీక్ అవర్‌లో ఎలాంటి మార్పు లేదని కూడా స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటలకు నాన్ పీక్ ఆవర్‌లో రూపాయి నుంచి రూపాయిన్నర రాయితీ పెంచినట్టు చెప్పుకొచ్చారు. చేనేత కార్మికులకు హార్స్ పవర్‌ను 10 నుంచి 25 హెచ్పీకి పెంచినట్టు శ్రీరంగారావు పేర్కొన్నారు.

గృహ వినియోగదారులకు మినిమమ్ ఛార్జీలు కూడా తొలగించినట్టు శ్రీరంగారావు తెలిపారు. గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలను కూడా కమిషన్ ఆమోదించిందన్నారు. ఆర్ఎస్పీ కేవలం 5 నెలల వరకే ఉంటాయని వివరించారు. రూ.11,499.52 కోట్లు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చిందని.. రూ.1,800 కోట్లు ప్రపోజల్స్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. డిస్కంలు రూ.57,728.90 పిటిషన్ వేస్తే.. ఈఆర్సీ రూ.54,183.28 కోట్లు ఆమోదించిందిని శ్రీరంగారావు పేర్కొన్నారు.

## కేరళ సీఎం కాన్వాయ్ కు ప్రమాదం

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

కేరళ సీఎం పినరయి విజయన్ కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. తిరువనంతపురం జిల్లా వామనపురం వద్ద సోమవారం సాయంత్రం 6.30 గంటలకు కాన్వాయ్‌లోని ఐదు వాహనాలు వెనుక నుంచి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఇందులో పోలీసు ఎస్కార్ట్, ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న కారు, అంబులెన్స్ కూడా ఉండడం గమనార్హం. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

సీఎం కాన్వాయ్ ప్రయాణిస్తున్న అదే రోడ్డులో ఓ మహిళ స్కూటీపై వెళ్తోంది. ఆమె నడి రోడ్డుపై మలుపు తీసుకుంటుండగా వెనుకవైపు నుంచి వచ్చిన సీఎం కాన్వాయ్‌లోని పోలీసు వాహనం ఒక్కసారిగా ఆగింది. ఇక కాన్వాయ్‌లో వెనుక నుంచి వస్తున్న వాహనాలు కంట్రోల్ అవ్వలేదు. సడెన్ బ్రేక్స్ వేసినా ఫలితం లేకపోయింది. దీంతో వరుసగా ఐదు వాహనాలు ఒక్కదాన్ని మరొకటి ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో అంబులెన్స్ కూడా కాస్త డ్యామేజ్ అయ్యింది. ఇక వెంటనే అప్రమత్తమైన భద్రత సిబ్బంది కారులోంచి దిగి సీఎం వాహనం వద్దకు చేరుకుంది. అయితే ముఖ్యమంత్రి కారు పెద్దగా డ్యామేజ్ కాకపోవడం వల్ల అదే వాహనంలో ఆయనను అక్కడ నుంచి వెంటనే పంపివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడం వల్ల అంతా ఊపిరి పీల్చుకున్నారు. నడిరోడ్డుపై సీఎం కాన్వాయ్? ప్రమాదానికి గురవ్వడం వల్ల స్థానికులు షాక్ అయ్యారు. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్?గా మారింది.

### ప్రయివేటు రంగంలో

## యుద్ధ విమానాల తయారీ కర్మాగారం ప్రారంభం




బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోనే ప్రైవేట్ రంగంలో మొట్టమొదటి యుద్ధ విమానాల తయారీ కర్మాగారం అందుబాటులోకి వచ్చింది. గుజరాత్‌లోని వడోదర లో ఏర్పాటు చేసిన సి-295 సైనిక రవాణా విమానాల ఉత్పత్తి కర్మాగారాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. స్పెయిన్ ప్రధాన మంత్రి పెడ్రో సాంచెజ్ తో కలిసి సోమవారం ఉదయం ఈ కర్మాగారాన్ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు.

అనంతరం కర్మాగారంలోని విశేషాలను ఎయిర్‌బస్ సంస్థకు చెందిన ఉద్యోగులు ప్రధానికి వివరించారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్ పటేల్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ, సాంచెజ్? కలిసి ఓపెన్? జీప్?లో విమానాశ్రయం నుంచి టాటా ఎయిర్ క్రాఫ్ట్ కాంప్లెక్స్ వరకు రోడ్ షోను నిర్వహించారు.

వడోదరలో ఏర్పాటైన సి-295 విమానాల కర్మాగారం భారత్, స్పెయిన్ దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. వడోదరలో తయారయ్యే విమానాలు భవిష్యత్తులో ఇతర దేశాలకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. వడోదరలో ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ ప్రాజెక్ట్ 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' మిషన్‌ను కూడా బలోపేతం చేస్తుందని తెలిపారు. స్పెయిన్‌లో యోగా కూడా బాగా ప్రాచుర్యం పొందిందని తాను విన్నానని ప్రధాని మోదీ తెలిపారు. స్పెయిన్ ఫుట్‌బాల్ టీమ్‌ను భారతీయులకు చాలా ఇష్టపడతారని చెప్పుకొచ్చారు. "ఇది నా స్నేహితుడు పెడ్రో శాంచెజ్ మొదటి భారతదేశ పర్యటన. ఇకనుంచి మేము భారత్- స్పెయిన్ భాగస్వామ్యానికి కొత్త దిశను అందిస్తున్నాం. సి-295 విమానాల ఉత్పత్తి కర్మాగారాన్ని ప్రారంభించాం" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ నుంచి మొదటి విమానం 2026లో అందుబాటులోకి వస్తుందని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తెలిపారు. ప్రధాని మోదీ దార్శనికత భారత్‌ను పారిశ్రామిక శక్తిగా మార్చిందని కొనియాడారు. వడోదరలో ఏర్పాటైన ఈ కర్మాగారం ఇతర ఐరోపా దేశాలు భారత్?కు వచ్చేందుకు ద్వారాలు తెరిచిందని వ్యాఖ్యానించారు. ఎయిర్ బస్, టాటా భాగస్వామ్యం భారత వైమానిక రంగ పురోగతికి బాటలు వేస్తుందన్నారు.

నేటి నుంచి కచ్చితంగా రెండేళ్లలో తొలి విమానం డెలివరీ చేస్తామని ప్రధానికి హామీ ఇచ్చారు టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్. ఆ రోజు మళ్లీ ప్రధాని ఇక్కడికి వచ్చి దానిని ఆవిష్కరించేందుకు వీలుగా తేదీని రిజర్వ్ చేయాలని పీఎంఓను కోరినట్లు తెలిపారు. టాటా గ్రూప్‌నకు చెందిన 200 మంది ఇంజినీర్లు ఇప్పటికే స్పెయిన్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు. తాము 40ఎస్ ఎంఈలతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కోసం 2012 నుంచే దివంగత రతన్ టాటా కృషి చేసినట్లు వెల్లడించారు. ఎయిర్ బస్ సంస్థతో స్నేహ సంబంధాలు నడిపి ఈ భాగస్వామ్యానికి పునాది వేశారన్నారు.



### కులగణనలో తెలంగాణ ఒక మోడల్

- డిప్యూటీ సీఎం భట్టి

మిగితా 3వ పేజీలో

## బుచ్చమ్మది ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్యే



- ఆమె కుటుంబానికి అండగా ఉంటాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్
- బుచ్చమ్మ కుటుంబాన్ని పరామర్శించిన మాజి మంత్రి కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

బుచ్చమ్మది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైడ్రా కూల్చివేతల భయంతో కూకట్‌పల్లి యాదవ బస్తీలో గుర్రంపల్లి బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకుందన్నారు. బుచ్చమ్మ కుటుంబాన్ని సోమవారం కేటీఆర్ పరామర్శించారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ నేత కేటీఆర్ భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ "అర్థం, పర్థం లేకుండా ఆనాలోచితంగా గుడ్డెద్దు చేలో పడినట్లు ఇష్టమొచ్చినట్లు కూకట్ పల్లిలోని నల్ల చెరువు వద్ద కూల్చివేతలు చేశారు. హైడ్రా అనే బ్లాక్ మెయిల్ సంస్థను పేదల మీదకు ఉసిగొల్పి నోటీసులు ఇవ్వకుండానే మీ ఇళు కూలగొడుతామంటూ భయానక వాతావారణం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించింది. పిల్లలు పుస్తకాలను తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా పేదల ఇళ్లు కూలగొడుతున్నారు.ఎక్కడ నా ఇల్లు కూలగొడుతారేమోనని బుచ్చమ్మ అనే మహిళ మూడు రోజులుగా ఆందోళన చెంది ఆత్మహత్య చేసుకున్నారు. వాళ్ల కుటుంబాన్ని చూస్తే బాధనిపిస్తోంది. ఎంతో కష్టపడి మా బిడ్డలకు ఉపయోగపడతదని ఇళ్లు కట్టామని బుచ్చమ్మ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. వాళ్లే పర్మిషన్లు ఇచ్చి ట్యాక్స్ కట్టించుకొని వాళ్లే ఇల్లు కూలగొడుతారంట. హైడ్రా అనే సంస్థ కారణంగానే బుచ్చమ్మ బలవన్మరణం పొందారు. ఇది ఆత్మహత్య కాదు హైడ్రా అనే అరాచక సంస్థతో రేవంత్ రెడ్డి చేయించిన హత్య. మీ దిక్కుమాలిన చర్యల కారణంగా పేదలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

వేదశ్రీ అనే పాప ఏడుస్తూ పుస్తకాలు తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా ఇళ్లు కూలగొట్టారు. ఇంత అమానవీయంగా ప్రవర్తించాలా ? ఈ రాష్ట్రంలో పేద వాళ్లకు మాత్రమే చట్టాలున్నాయా ? రేవంత్ రెడ్డి నీ అన్నకు మాత్రం ఎఫ్టీఎల్ లో ఉన్న ఇల్లుకు నోటీసులిస్తారా ? పేదవాళ్ల పుస్తకాలు తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా ఇల్లు కూల్చటమనేది ఇంతకంటే దిగజారిన, దిక్కుమాలిన చర్య ఏదైనా ఉంటుందా ?ఎన్నో హామీలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కడతాం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అన్నారు. ఒక్క ఇళ్లు కట్టలేదు. కానీ ఎన్ని ఇళ్లు కూలగొట్టావో ప్రజలు గమనిస్తున్నారు. హైదరాబాద్ లో మాత్రమే కాదు ఊళ్లలో కూడా రేవంత్ రెడ్డి అరాచకం గురించి మాట్లాడుతున్నారు. నువ్వు నీ కేబినెట్ మంత్రులు ఏం చేస్తున్నారో ప్రజలంతా చూస్తున్నారు.

హైడ్రాతో ఆర్థిక మంత్రికి ఏంటీ సంబంధం. ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాడు. ఐదు మంది బిల్డర్ల పేరు చెబుతాడు. ఎందుకిదంతా బ్లాక్ మెయిల్ దందానా ? నీ మంత్రులు, నీ తమ్ముళ్లకు ఇదే దందానా ? పెద్ద పెద్ద బిల్డర్లను బెదిరించి వాళ్ల దగ్గర దందా చేసి చందాలు తీసుకోవటానినా నీ ప్రభుత్వం ఉన్నది. గరీబోళ్ల ఇళ్లు కూలగొట్టి హైడ్రా పేరుతో దందా చేస్తున్నారు. ఈ హత్య కేసు రేవంత్ రెడ్డి పైన ఆయన హైడ్రా పైన పెట్టాలి.బుచ్చమ్మ కుటుంబానికి అండగా ఉంటాం. వారికి ఆర్థిక సాయం చేశాం. హైడ్రా బాధితులందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుంది. మీకు న్యాయసాయం చేస్తుంది. రాష్ట్రం మొత్తం మీద ఇవాళ అరాచకం నడుస్తోంది. గరీబోళ్ల పొట్టకొట్టే ప్రభుత్వ చర్యలపై పోరాడుతాం, న్యాయ పోరాటం కూడా చేస్తాం. గరీబోళ్లకు మేము అండగా ఉంటాం. వారికి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తోడుగా ఉంటారు. హైదరాబాద్ ప్రజలు మాకు ఓటు వేసినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పగా, కసి పెంచుకుంది. కచ్చితంగా ఈ ప్రభుత్వం మీద మనందరం తిరగబడాల్సిందే." అని కేటీఆర్ అన్నారు.

## ఫాంహౌస్ ఘటన వెనుక రేవంత్ ప్రభుత్వ కుట్ర



- రేవ్ పార్టీ అని అసత్య ప్రచారం
- రాష్ట్రం ధర్నాలతో అట్టుడుకుతోంది
- రేవంత్ తానా అంటే బండి సంజయ్ తందానా అంటాడు

బలగం టీవి, హైదరాబాద్

ఫాంహౌస్ ఘటన వెనుక రేవంత్ ప్రభుత్వ కుట్ర ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంఎల్‌సిలు శంభీపూర్ రాజు,దేశపతి శ్రీనివాస్,దేవిప్రసాద్ పల్లె రవికుమార్‌లతో హరీశ్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఫాంహౌస్ ఘటన వెనుక రేవంత్ ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. అది ఫాంహౌస్ కాదు.. రాజ్ పాకాల కొత్త ఇల్లు అని తేల్చిచెప్పారు. రేవ్ పార్టీ అని కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని అది రేవ్ పార్టీ కాదు.. ఫ్యామిలీ ఫంక్షన్ అని స్పష్టం చేశారు. రేవ్ పార్టీలో పిల్లలు, వృద్ధులు ఉంటారా అని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే.. కటిఆర్‌పై బురద జల్లుతున్నారని విమర్శించారు. మూసీ విషయంలో పేదల పక్షాన పోరాడుతున్నందునే కెటిఆర్‌ను రేవంత్ రెడ్డి టార్గెట్ చేశారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదీశారని విమర్శించారు. వివిధ వర్గాల నుంచి వస్తోన్న వ్యతిరేకతతో రేవంత్ రెడ్డి వణికిపోతున్నారని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఏ వర్గానికి తామిచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని, సీఎం వికృతరూపం బట్టబయలైందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా చూసినా ధర్నాలతో అట్టుడికిపోతోందని చెప్పారు. ధర్నాలు చేస్తున్న వారిని చర్చలకు పిలవొచ్చు కదా..ఎందుకు చర్చలు జరపడం లేదని అడిగారు. నోటికొచ్చినట్టు మాట్లాడడం మాత్రమే ముఖ్యమంత్రికి తెలుసు అని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని, హామీలు అమలు చేయమంటే నోటికొచ్చినట్టు తిడుతున్నారని మండిపడ్డారు.

కొత్త హామీలు అమలు చేయకపోగా, కెసిఆర్ మానవీయ కోణంలో పేదలు, ప్రజల కోసం తెచ్చిన పథకాను సిఎం రేవంత్ రెడ్డి కొనసాగించలేకపోతున్నారని అన్నారు. బతుకమ్మ చీరలు ఒకటి కాదు రెండు ఇస్తామన్నారని, కానీ ఒక్కటి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినప్పటికీ.. రైతుల కోసం కెసిఆర్ రైతుబంధు అమలు చేశారని చెప్పారు. రెండు పంటలకు కాదు మూడు పంటలకు రైతుబంధు ఇస్తా అని రేవంత్ రెడ్డి అన్నారని, కానీ ఒక్క పంటకు కూడా రైతు బంధు ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలు కొనే దిక్కు లేదని ధ్వజమెత్తారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనస్థాయికి తగ్గించుకుని మాట్లాడుతున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తానా అంటే.. బండి సంజయ్ తందానా అంటున్నారని విమర్శించారు. బాధ్యత కలిగిన పదవీలో ఉండి బండి సంజయ్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందా.. ఆర్ఎస్ బ్రదర్స్ ప్రభుత్వం నడుస్తోందా..? అని నిలదీశారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సహాయమంత్రిగా పనిచేస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డికి మెదడు నిండా విషం తప్ప విజన్ లేదని ఎద్దేవా చేశారు. కెటిఆర్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేయటం మంచిది కాదని హెచ్చరించారు. హత్యా రాజకీయాలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీనే రోడ్డు మీదకొచ్చారని గుర్తుచేశారు. మూసీ విషయంలో నల్లగొండ రైతులతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులే రోడ్డు మీదకు వచ్చి ధర్నాలు చేస్తున్నారని అన్నారు. రుణమాఫీపై ప్రశ్నించినందుకు రేవంత్ రెడ్డి తనను బాడీ షేమింగ్ చేశారని ధ్వజమెత్తారు.

పోలీసుల మీదనే నిర్బంధాలు పెట్టిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదే అని హరీశ్‌రావు విమర్శించారు. పండుగల సమయంలో రాష్ట్రంలో 144 సెక్షన్ విధించి ప్రజలు ప్రశాంతంగా షాపింగ్‌లు, పెళ్లిళ్ల చేసుకునే పరిస్థితి లేకుండా చేశారని అన్నారు. పోలీసులకు మూకలుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు హక్కులు అడిగితే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని అన్నారు. ఇప్పటికే 39 మంది పోలీసులను సస్పెండ్ చేయగా, 10 మందిని డిస్మిస్ చేశారని తెలిపారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా ఏక్ పోలీసింగ్ విధానం అమలు చేయాలని, తమ సెలవులు రద్దు చేయవద్దని పోలీసులు కోరుతున్నారని అన్నారు. 11 నెలల్లోనే కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజలు తిరగబడుతున్నారన్నారని పేర్కొన్నారు. ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలు కాదు.. అందులో 10 శాతం అంటే 20 వేల ఉద్యోగాలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదని హరీశ్‌రావు తెలిపారు.

# మాజీ సర్పంచ్‌ల జేఏసీ తాత్కాలికంగా దీక్ష విరమణ




**బలగం టీవీ , బోయినపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం.రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని రిలే నిరాహారదీక్ష 11వ రోజుతో తాత్కాలికంగా దీక్ష విరమణ చేస్తూ, భవిష్యత్తు కార్య చరణ ప్రకటించడం జరిగింది.దీపావళి తర్వాత ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలపడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్ మాట్లాడుతూ: భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తూ, సర్పంచుల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించకుంటే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తామని మరియు ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు గుంటి వేణు, బిజెపి పార్టీ మాజీ సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు అరుకాల రమేష్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపాధ్యక్షులు గణప శివజ్యోతి, గౌరవ సలహాదారులు చాకలి రమేష్, బొజ్జం మల్లేశం,కార్యదర్శిలు, కోల నరసయ్య,గున్నాల లక్ష్మణ్, చల్ల నారాయణ సంయుక్త కార్యదర్శిలు గాండ్ల సుమతి, తాడేపు ఎల్లం, కీర్తిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, మడిగల రవీందర్, కార్యవర్గ సభ్యులు చిట్నేని శ్రీనివాసరావు, తంపుల సుమన్, రాచూరి రాజేశం, సోషల్ మీడియా కన్వీనర్ ఆరె మహేందర్, తదితర జిల్లా సర్పంచులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలి..

- విద్యుత్ దీపాలకు కనెక్షన్ ఏర్పాటు చేయాలి..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , సిరిసిల్ల:**

సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డులోని చంద్రంపేట జంక్షన్ వద్ద విద్యుత్ దీపాలకు కనెక్షన్ ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.సోమవారం సిరిసిల్ల నుంచి కోనరావుపేట మార్గంలో చంద్రంపేట జంక్షన్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి పరిశీలించారు. ఈ రహదారి వెంబడి విద్యుత్ దీపాలకు వెంటనే విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సెస్ అధికారులకు సూచించారు. శాశ్వత ప్రాతిపదికన పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇక్కడ సిరిసిల్ల మున్సిపల్ డీ.ఈ. వాణి, ఏఈ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల కృషి అభినందనీయం



- పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి..
- ఎస్పీ అఖిల్ మహాజన్.

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

ప్రజా రక్షణలో, శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో విధి నిర్వహణ చేస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం బతుకమ్మ ఘాట్ నుండి గాంధీ,అంబేద్కర్ చౌరస్తా మీదుగా బతుకమ్మ ఘాట్ వరకు 2కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజా క్షేమం కోసం పని చేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతి సంవత్సరం వివిధ కార్యక్రమలు చెపడుతున్నామని,అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ వారి ఆశయ సాధన కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని అన్నారు.ప్రతీ ఒక్కరి ఆరోగ్య రక్షణకు వ్యాయామం చేయడం ముఖ్యమని,మానసికంగా,శారీరకంగా దృఢంగా ఉండడానికి వాకింగ్,వ్యాయామం,యోగ ప్రతి నిత్యం చేయాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు.యువత చెడు మార్గాల వైపు మరలకుండా చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని అన్నారు.అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన 2కె రన్ లో ప్రజలు, విద్యార్థులు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు.

2కె రన్ లో అందరితో పాటుగా పాల్గొని పూర్తి చేసిన ఇద్దరు మహిళలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి వారికి అందరూ ఆదర్శంగా తీసుకోవలన్నారు.ఈ కార్యక్రమంలో అధనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు కృష్ణ, వెంకటేశ్వర్లు, ఆర్ఐ లు యాదగిరి, రమేష్, ఎస్ఐ లు,పోలీస్ సిబ్బంది, మెడికల్ కాలేజ్ విద్యార్థులు, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, పాలిటెక్నిక్ , జె ఎన్ టీ హెచ్ యు కాలేజ్ విద్యార్థులు, పట్టణ యువత ,వాకర్స్ పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీలకు వేగంగా పరిష్కారం చూపాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ప్రజావాణి అర్జీలకు వేగంగా పరిష్కారం చూపాలని,నిర్ణీత గడువులోగా వినతులు పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు సూచించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని అన్నారు.. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




## బియ్యం వితరణ

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన దూమాల లింగయ్య గత వారం రోజుల క్రితం స్వర్గస్తులైనారు. ఆదివారం రోజున వారి కుటుంబ సభ్యులను విలాసాగర్ భవన కార్మిక సంక్షేమ సంఘం తరపున వారి కుటుంబాన్ని పరామర్శించి,వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం వితరణ చేసినారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు దుమాల మల్లేశం, ఉపాధ్యక్షులు బొడ్డు శంకర్, గౌరవ అధ్యక్షులు సుంకపాక దేవయ్య, గజ్జెల రాజు, సుంకపాక అనిల్, దోమకొండ కిరణ్, కల్లేపెల్లి సతీష్, సుంకపాక విక్రమ్ బాబు, గజ్జెల బాబు, దుమాల బాబు, సుంకపాక తిరుపతి, దొబ్బల యాదగిరి, దావ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్...



- కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం.
- చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ ,వేములవాడ**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమై, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధముగా సన్న రకం వడ్లకు క్వింటాలకు 500 రూపాయల బోనస్ ఈ పంట నుండి ఇస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.అది వారం వేములవాడ అర్బన్ మండలం అనుపురం, సంకేపల్లి గ్రామాల్లో, చందుర్తి మండలంలోని సనుగుల గ్రామంలో, మూడపల్లి గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని,రైతును రాజు చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని అన్నారు.

20 సంవత్సరాల క్రితం దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు.కొనుగోలు కేంద్రాల నిర్వహణను మహిళా సంఘాలకు,ప్యాక్స్, డీసీఎంఎస్ లకు అప్పజెప్పడం జరిగింది అని,రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు ఉచిత విద్యుత్ పంపిణీ ఫైల్ పై వైయస్సార్ తొలి సంతకం చేశారని అన్నారు.క్షేత్ర స్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది అని,రైతులకు సరిపడా టార్పలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని అన్నారు.

రైతులకు మేలు కలిగే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో చర్యలు తీసుకుంటామని,రైతులకు ఏకకాలంలో 2లక్షల రుణమాఫీ చేశామని అన్నారు.సాంకేతిక సమస్య వల్ల మాఫీ కానీ రైతుల ఖాతాల్లో జమ చేయడానికి వ్యవసాయ శాఖ,బ్యాంకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.

రైతులు 17 శాతం తేమ వచ్చాక ధాన్యం తూకం వేయడం జరుగుతుంది అని,కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని అన్నారు.

మిలో ఒకడిగా ఉంటూమీ సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు పోతున్న,ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరానికి కృషి చేస్తానని అన్నారు.

ముంపు గ్రామాల సమస్యల పై గతంలో 3000 పైగా దరఖాస్తు లను గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు అని,ఇప్పుడు ప్రజా ప్రభుత్వం లో ఆ దరఖాస్తులను క్రోడీకరించి వాటికి త్వరలోనే శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.ఆనాడు పాదయాత్ర చేసి శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వైయస్ రాజశేఖర్ రెడ్డి తీసుకువచ్చి 1737 కోట్లు మంజూరు చేసారని తెలిపారు. మొన్నటి బడ్జెట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో 325 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు.. రాజకీయంగా జన్మనిచ్చిన చందుర్తి మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని అన్నారు ..

ఏమన్నా మీకు ఎమ్మెల్యేగా అవకాశం ఉంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వ విప్ గా అవకాశం ఇచ్చారని తెలిపారు.. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు వేములవాడ నియోజకవర్గం అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో మంజూరైన ఒకే ఒక యారన్ డిపోను చేనేత క్లస్టర్ గా పేరొందిన వేములవాడకు తీసుకురావడం జరిగిందని తెలిపారు.. ఇటీవల మూడపల్లి గ్రామంలో ప్రజల సౌకర్యం నిర్మాణానికి 82 లక్షల నిధులు మంజూరు చేశానని అన్నారు ..

గల్ఫ్ కార్మికులను గత ప్రభుత్వ మోసం చేసిందని తెలిపారు.. ప్రజా ప్రభుత్వంలో గల్ఫ్ కార్మికులకు జీవో తెచ్చి గల్ఫ్ లో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఐదు లక్షల వేములవాడ నియోజకవర్గం లోని మొట్టమొదటిది ఇవ్వడం జరిగింది అని అన్నారు ..

గత ప్రభుత్వం 7 లక్షల కోట్లు అప్పు చేసిందని ప్రజా ప్రభుత్వంలో వచ్చే రాబడి గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీ కట్టడానికి పోతుందని అన్నారు ..ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు కోరుకునేదే చేస్తూ ముందుకు పోతున్నామని తెలిపారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్య విద్యార్థి లాగా ప్రజలు అధికారులు చెప్పేది వింటూ నూతన పాలసీలను తయారు చేస్తున్నారని అన్నారు ..



## ఉద్యమ కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో ఆదివారం రోజున ఉద్యమ కళాకారులందరు సమావేశమై కళాకారులు మాట్లాడుతూ గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వములో 10 సంవత్సరాలు మాకు న్యాయం జరగలేదని,ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమ కళాకారులను గుర్తింపునకు ఒక కమిటీ వేసి, కళా కారులను తక్షణమే ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కళాకారుల మండల కమిటీ. రాజన్న సిరిసిల్ల జిల్లా సహాయ కార్యదర్శి కనపర్తి హనుమన్లు, బోయినిపల్లి మండల కళాకారుల అధ్యక్షులు మొగులోజు లక్ష్మీరాజం, మండల కార్యదర్శి బిల్ల వెంకనర్సు, గాయకులు సావనపల్లి లక్ష్మీనారాయణ, బిల్లా కమలాకర్, తబలిస్ట్ బిల్లా శంకర్, కళాకారులు మగులోజి రమేష్, మొగులోజి ఆంజనేయులు తదితర కళాకారులు పాల్గొన్నారు.

# సింగరేణిలో ప్రతి 3 నెలలకు ఒకసారి ఎస్సీ, ఎస్టీల సమస్యలపై సమీక్ష




- **రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బ్రక్కి వెంకటయ్య**
- **నవంబర్ 12న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల లైజన్ సెల్ ప్రారంభం-**
- **సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ప్రకటన**

**బలగం టీవి, హైదరాబాద్**

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి లైజన్ ఆఫీసర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించాలని, ప్రమోషన్లు, పోస్టింగులలో ఈ వర్గాలకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బ్రక్కి వెంకటయ్య ఆదేశించారు.

హైదరాబాద్ సింగరేణి భవన్ లో సోమవారం మధ్యాహ్నం జరిగిన కమిషన్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండి శ్రీ ఎన్.బలరామ్, కమిషన్ సభ్యులు, సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లు, ఉద్యోగ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అధికారులకు ప్రమోషన్లు కల్పించే కమిటీలలో, రక్షణ కమిటీలలో ఎస్సీ, ఎస్టీ కులాల నుంచి కనీసం ఇద్దరిని సభ్యులుగా చేర్చాలని సూచించారు. తద్వారా ఆ కులాల వారికి అన్యాయం జరగకుండా చూసి అవకాశం ఉంటుందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి బాబా సాహెబ్ అంబేద్కర్ జాతికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన విగ్రహాలను ప్రతీ జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేయాలని, అవసరమైతే ఈ విషయంలో ప్రభుత్వం తరపున మాట్లాడి సహకరిస్తామని వివరించారు. సింగరేణి సంస్థ చైర్మన్ గా ఉన్న

ఎన్. బలరామ్ ఇప్పటికే అన్ని రకాల సమస్యలను సమర్ధంగా పరిష్కరిస్తున్నారని, కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యలను కూడా పరిష్కరించాలని సూచించారు.

అలాగే సంస్థ చైర్మన్, ఎండి ఎన్.బలరామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కమీషన్ చైర్మన్ సూచించిన విధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి సింగరేణీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో పేర్కొన్న ప్రతి సమస్యను తాను నమోదు చేసుకున్నామనీ, నిబంధనలు మేరకు అన్ని సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కమిషన్ సూచన మేరకు సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల లైజన్ సెల్ కార్యాలయాన్ని కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో ఏర్పాటు చేశామని, నవంబర్ 12వ తేదీన దీనిని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సమావేశం ప్రారంభంలో అన్నిఏరియాల నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు వివిధ రకాల ప్రమోషన్లు, బదిలీలలో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. అనేక వ్యక్తిగత, ఉద్యోగ సమస్యలు కూడా కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను తిరిగి కమిషన్ వారు సంస్థ చైర్మన్ కు వివరించారు వీటిపై నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ హామీ ఇచ్చారు

ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ,జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్ తో పాటు సింగరేణి సంస్థ నుండి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ మరియు పర్సనల్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ కో–ఆర్డినేషన్ ఎస్. డి. ఎం.సుభాని, జీఎంలు శామ్యూల్ సుధాకర్ కవిత నాయుడు, మిస్ బెనడిక్ట్ నికోలస్, ఎస్సీ చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్, ఎస్టి చీఫ్ లైజన్ ఆఫీసర్వీసం కృష్ణయ్య, జీఎంలు శ్రీ సురేష్ బాబు, బండి వెంకటయ్య, సూర్యనారాయణ, డీజీఎం పర్సనల్ అజయ్ కుమార్ ఇంకా సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘాల నాయకులు, ఏరియాల లైజన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# కులగణనలో తెలంగాణ ఒక మోడల్

- **డిప్యూటీ సీఎం భట్టి**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో చేపట్టనున్న కులగణన దేశవ్యాప్తంగా ఒక మోడల్ గా నిలుస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సచివాలయంలో సామాజికవేత్తలు, మేధావులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. కులగణనలో చేయాల్సిన మార్పులు, చేర్పులు ఇంకా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారితో సమాలోచనలు జరిపారు.రాష్ట్రంలో వచ్చే నెల 6 నుంచి చేపట్టనున్న కులగణనకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక, దిశా నిర్దేశం చేయడానికి మంగళవారం కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి సమాచారం తీసుకునేందుకు ఇంకా ఎలాంటి ప్రశ్నలు వేస్తే బాగుంటుంది అని వారిని సలహాలు అడిగారు.రాష్ట్రవ్యాప్తంగా 300 మంది సామాజికవేత్తలు, మేధావులు, అభ్యుదయ వాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను, సందేశాలను పరిగణలోకి తీసుకుంటామని అన్నారు. వీరితో పాటు కుల సంఘాలు, యువజన సంఘాలను పిలిచి వారి అభిప్రాయాలు తీసుకుంటామని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ%ా% ఎన్నికలకు ముందు కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ బహిరంగ సభలో కులగణన చేస్తామని ప్రకటించామని, ఆ తర్వాత కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ అంశాన్ని పొందుపరిచామని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసెంబ్లీలో తీర్మానం చేసి ఇచ్చిన హామీని అమలు చేయడానికి కార్యరూపం తీసుకువచ్చామని తెలిపారు. పాత కమిషన్ కాలం ముగిసిన వారంలోపే కొత్త బీసీ కమిషన్ వేశామని, బీసీ సంక్షేమం అభ్యున్నతి పట్ల ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ సింహాద్రి, సామాజిక విశ్లేషకుడు పాశం యాదగిరి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మన ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా ముందుకు పోతున్నాం..

- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ ,వేములవాడ:**

మత్స్యకారుల కుటుంబాల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో మిడ్ మానేరు పరిధిలోని వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో ఉచితంగా 80 వేల చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మత్స్యకారులకు 100% సబ్సిడీతో ఉచిత చేప బిల్లలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని యజ్ఞంల నిర్వహిస్తున్నారనిఅన్నారు . ఈ నెల 4వ తేదీన మంత్రి పొన్నం ప్రభాకర్ ఎల్ఎండిలో చేప పిల్లల్ని విడుదల చేశారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 53 కోట్ల చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు,చేపలను తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్య కార్మికులకు ఐదు లక్షల ఆర్థిక సహాయం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు. మిడ్ మానేరు జలాశ పరిధిలోని రుద్రావరం గ్రామంలో గతంలో కేజీ కల్చర్ చేప పిల్లల పెంపకంపై అవగాహన కల్పించాం,మత్స్యకారులు ముందుకు వస్తే సబ్సిడీ ద్వారా కేజీ కల్చర్ చేపల యూనిట్ మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని,దానికి సరిపడా మార్కెటింగ్ అవకాశాలను కూడా కల్పిస్తామనిఅన్నారు . రాజన్న సిరిసిల్ల జిల్లా కార్మిక ధార్మిక క్షేత్రంగా విరజిల్లుతుందని,మన ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఇప్పటికే వేములవాడలో 50 కోట్లతో యారన్ డిపో, రాజన్న ఆలయ అభివృద్ధికి 50 కోట్ల నిధులు మంజూరు చేశారనిఅన్నారు .మత్స్యకారులు అన్ని అవకాశాలను అందిపుచ్చుకోనికి ముందుకు పోవాలని,జిల్లా లోని 8642 మత్స్య కార్మిక కుటుంబాలకు చేతినిండా పని, ఆర్థికంగా ప్రగతిలోకి తీసుకువచ్చేందుకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో మిడ్ మానేరులో మొత్తం 14 లక్షల పైచిలుకు చేప పిల్లలను విడుదల చేయనున్నామని అన్నారు .ఇందులో భాగంగా మొదటి విడుతలో 80 వేల చేప పిల్లలను ఈ రోజు విడుదల చేశామనిఅన్నారు .ఈ కార్యక్రమంలో ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వేములవాడ ఆర్టీవో రాజేశ్వర్, జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి, అర్బన్ తాసిల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాలలు ,ఫ్లై ఓవర్ ల నిర్మాణం వేగవంతం చేయాలి..

- **జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ ల సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్**

**బలగం టీవి, హైదరాబాద్**



హైదరాబాద్ విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఎస్ఆర్డిపి, ఎస్ఎన్డీపీ లో ప్రాజెక్ట్ భాగంగా చేపట్టిన ఫ్లై ఓవర్లు , నాళాల నిర్మాణాలు పై జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్లు ,ఇతర ఉన్నతాధికారులతో సచివాలయంలోని తన ఛాంబర్ లో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.హైదరాబాద్ లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ నుండి ప్రజల ఇబ్బందులను తగ్గించడానికి నగరంలో ఎస్ఆర్డిపి లో భాగంగా 48 ఫ్లే ఓవర్ లను ప్రారంభించింది. ఈ ఫ్లై ల ఓవర్ ద్వారా ట్రాఫిక్ సిగ్నల్ అవైడ్ చేయడానికి , సమయాన్ని , ఫ్యుయల్ ను అదా చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎస్ఆర్డిపి వర్క్స్ లో భాగంగా జీహెచ్ఎంసీ కి సంబంధించి 42 వర్క్ కాగా 6 ఫ్లై ఓవర్ లు ఆర్ అండ్ బి ,హెచ్ఎండీఏ కి చెందినవి అందులో ఇప్పటికే 36 పనులు పూర్తయ్యాయని చీఫ్ ఇంజనీర్ అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఎన్ హెచ్ లో భాగంగా నిర్మిస్తున్న అంబర్ పేట ఫ్లై ఓవర్,ఉప్పల్ – నారపల్లి నిర్మాణం కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే పెండింగ్ లో ఉన్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు వేగవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అరంఘర్ వయ శాస్త్రిపురం మధ్య నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు చివరి దశలో ఉండడంతో డిసెంబర్ లోపు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ఎస్ఎన్డీపీ లో భాగంగా నగరంలో నాళాల ద్వారా మురుగు నీటి వ్యవస్థ తదితర అంశాలపై సమీక్షా సమావేశంలో చర్చించారు.పెండింగ్ లో ఉన్న నాళాల పై ఆరా తీశారు. వచ్చే వర్షాకాలం సీజన్ లోపు వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ఫ్లై ఓవర్ లు ,కొత్త నాళాలు అవసరమైన చోట ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

జీహెచ్ ఎంసీ లో మాత్రమే కాకుండా పరిసర ప్రాంత మున్సిపాలిటీ లలో బడంగ్ పెట్ , జల్పల్లి,మీర్పేట్ తదితర కోర్డినేట్ చేసుకొని పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. రైల్వే డిపార్ట్మెంట్ కడుతున్న అండర్ పాస్ లు తదితర పనులు సీఎస్డీపీఎల్ 11 కేవీ /33కేవీ పనులపై విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సీఆర్ఎంపి రోడ్ల లో భాగంగా జీబ్రా క్రాసింగ్ లైన్ సైనెడ్ బోర్డులు ఇతర రోడ్డు మార్కింగ్ లు ఎక్కడైనా పెండింగ్ పనులు ఉంటే పూర్తి చెల్లించాలని కొత్త రోడ్లు అవసరం ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం నగరంలో 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 50 స్ట్రక్చర్స్ నిర్మించాల్సి ఉన్నప్పటికీ మొదటిదశ చేపట్టిన రైన్ వాటర్ హార్వెస్టింగ్ 18 ప్రాంతాల్లో 23 సంపులు పనులు ఎంత వరకు వచ్చాయి వాటి పురోగతి పై ఆరా తీశారు. కొన్ని నాళాల ద్వారా నీరు నేరుగా మూసిలోకి పోకుండా భూగర్భంలోకి ఇంకే విధంగా ప్రయత్నాలు చేయాలని దాని ద్వారా భవిష్యత్ లో వాటర్ సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఇప్పటికే 90 రోజుల వాటర్ హార్వెస్టింగ్ ప్రోగ్రాంలో భాగంగా పెద్ద పెద్ద అపార్ట్మెంట్ లలో ఇంకుడు గుంతలు నిర్మించుకునేల ప్రజలకు అవగాహన కల్పించాలనీ సూచించారు. భావి తరాలకు నీటి వనరులు అందించే సామాజిక బాధ్యతను అందరూ పాటించాలన్నారు. నగరంలో ఎక్కడ పెండింగ్ పనులు ఉన్న వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ ఎస్ఆర్డీపీ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ ఎం దేవానంద్ ,ఎస్ఎన్డీపీ చీఫ్ ఇంజనీర్ కోటేశ్వర రావు ,చీఫ్ ఇంజనీర్ మైంటనేన్స్ భాస్కర్ రెడ్డి ఆరు జోన్ల ఎస్ సి లు తదితర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# దక్షిణాఫ్రికా టూర్‌కు కొత్త కోచ్



**బలగం టీవీ, హైదరాబాద్**

దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు భారత జట్టు కోచింగ్ బాధ్యతలను వీవీఎస్ లక్ష్మణ్‌ను నియమించనున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియా పర్యటనతో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బిజీగా ఉండనున్న నేపథ్యంలో బీసీసీఐ ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఎన్సీఏ డైరెక్టర్‌గా ఉన్న లక్ష్మణ్ గతంలో కూడా టీమిండియాకు తాత్కా లిక కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. జింబాబ్వే పర్యటనలో శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని యువ జట్టును కోచ్‌గా నడిపించాడు.

నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియాతో జరగనున్న అయిదు టెస్టుల సిరీస్ కోసం రోహిత్ సేన నవంబర్ 10న బయలుదేరే అవకాశం ఉంది. మరోవైపు దక్షిణాఫ్రికాలో నవంబర్ 8 నుంచి 13వ తేదీ వరకు సౌతాఫ్రికాతో సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని జట్టు నాలుగు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ క్రమంలో సౌతాఫ్రికా సిరీస్‌కు కోచ్‌గా వ్యవహరించడానికి గంభీర్‌కు సాధ్యపడదు. ఈ నేపథ్యంలో లక్ష్మణ్‌కు తాత్కాలిక కోచ్‌గా బీసీసీఐ బాధ్యతలు అప్పగించనుందని తెలిసింది. లక్ష్మణ్‌కు సహాయక కోచింగ్ సిబ్బందిగా ఎన్సీఏలో ఇతర కోచ్‌లు, స్టాఫ్ అయిన సాయిరాజ్ బహుతులే, హృషికేష్ కంటికర్, శుభదీప్ ఘోష్ పనిచేయనున్నారు.

**దక్షిణాఫ్రికాతో టీ20ల షెడ్యూల్**

నవంబర్ 08: తొలి టీ20- డర్బన్
నవంబర్ 10: రెండో టీ20- సెయింట్ జార్జ్ పార్క్
నవంబర్ 13: మూడో టీ20- సెంచూరియన్
నవంబర్ 15: నాలుగో టీ20- జొహెన్నెస్‌బర్గ్

సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు భారత జట్టు: సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేష్ శర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రమణదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, విజయ్ కుమార్ వైశాఖ్, ఆవేశ్ ఖాన్, యశ్ దయాల్.

**ఆస్ట్రేలియాతో టెస్టుల సిరీస్ షెడ్యూల్**

నవంబర్ 22-26: తొలి టెస్టు- పెర్త్
డిసెంబర్ 06-10: రెండో టెస్టు- అడిలైడ్
డిసెంబర్ 14-18: మూడో టెస్టు- బ్రిస్బేన్
డిసెంబర్ 26-31: నాలుగో టెస్టు- మెల్‌బోర్న్
జనవరి 03-08: అయిదో టెస్టు- సిడ్నీ



# ఏఎన్నార్ జాతీయ పురస్కారం అందుకున్న చిరంజీవి

**బలగం టీవీ, హైదరాబాద్**

అన్నపూర్ణ స్టూడియోలో 2024కి గాను ఏఎన్నార్ జాతీయ పురస్కారాల వేడుకల ) కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవిని శాలువాతో సత్కరించి.. అక్కినేని జాతీయ అవార్డు ప్రదానం చేశారు అమితాబ్ బచ్చన్. ఈవెంట్‌లో అక్కినేని హీరోలతోపాటు చిరంజీవి తల్లి అంజనా దేవి, దర్శకేంద్రుడు కే రాఘవేంద్రరావు, త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వినీదత్, యాక్టర్లు వెంకటేశ్, నాని, రాంచరణ్, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం, ఎంఎం కీరవాణితోపాటు పలువురు సెలబ్రిటీలు పాల్గొన్నారు.

## ఆ అవార్డు రావడం కొందరికి నచ్చలేదు : చిరంజీవి

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. తనకి ఎన్ని అవార్డులు వచ్చినా కూడా ఏఎన్ఆర్ అవార్డు రావడం చాలా ప్రత్యేకమని చెప్పారు. " సాధారణగా అందరూ ఇంట గెలిచి రచ్చ గెలుస్తారు.. కానీ నేను మాత్రం రచ్చ గెలిచి ఇప్పుడే ఇంట గెలిచాను. నా సినీ జీవితంలో ఎన్నో చిత్రాలు చేశాను. ఎన్ని సినిమాలు చేసినా, ఎంత క్రేజ్ వచ్చినా ఏనాడు కూడా ఇంట్లో మా నాన్న పొగిడేవాడు కాదు. ఈ విషయంలో మదనపడేవాడిని. ఈ విషయాన్ని అమ్మకి చెప్పాను. పిల్లలను తల్లిదండ్రులు పొగడటం ఆయుఃక్షీణం అందుకే మీ నాన్న అలా పొగడరని, అస్తమానం నీ గురించే చెబుతుంటారు అని చెప్పింది.

తెలుగు సినిమా వజ్రోత్సవ వేడుకల్లో నాకు లెజెండరీ అవార్డు వచ్చింది. నాకు అది ఇవ్వడం కొందరికి నచ్చలేదు. ఈ విషయం నాకు తెలిసి.. ఆ రోజు ఆ అవార్డును తీసుకోలేదు. దాన్ని దాచి ఏ రోజైతే నాకు ఆ అర్హత వస్తుందని అందరూ భావిస్తారో అప్పుడే తీసుకుంటానని చెప్పా. ఇప్పుడు నాకు ఆ అర్హత వచ్చింది. ఎందుకంటే లెజెండరీ ఏఎన్ఆర్ నేషనల్ అవార్డు నాకు రావడం.. ఇది కూడా అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా అందుకున్నాను. ఇది కదా అవార్డు అంటే.. నేను రచ్చ గెలిచాను, ఇంట కూడా గెలిచానని" చిరంజీవి చెప్పారు.




# పాకిస్థాన్ జట్టు కెపెన్‌గా మహ్మద్ రిజ్వాన్




**బలగం టీవీ, హైదరాబాద్**

పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కొత్త సారథిగా వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ నియమితులయ్యాడు. సుమారు ఏడాదిన్నర కాలంగా ఫామ్‌లేమితో బాధపడుతూ జట్టును విజయవంతంగా నడపలేక పోతున్న మాజీ సారథి బాబర్ ఆజమ్ కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పగా ఆ స్థానాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) రిజ్వాన్‌తో భర్తీ చేసింది. త్వరలో పాక్.. ఆస్ట్రేలియా, జింబాబ్వే పర్యటనలకు వెళ్లనుంది. ఇక ఆదివారం పీసీబీ ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్టుల జాబితాలో స్టార్ పేసర్ షహీన్ షా అఫ్రిది 'ఏ' కేటగిరీ నుంచి 'బీ'కి పడిపోయాడు. టెస్టు సారథి షాన్ మసూద్.. 'డీ' నుంచి 'బీ'కు ప్రమోట్ అయ్యాడు. బాబర్, రిజ్వాన్ 'ఏ' కేటగిరీలో తమ కాంట్రాక్టులను నిలుపుకున్నారు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు బాబర్‌ను పక్కనబెట్టడంపై వ్యాఖ్యానించిన ఫకర్ జమాన్ సెంట్రల్ కాంట్రాక్టును కోల్పోయాడు.



# రూ. 1000 కోట్ల బడ్జెట్‌తో మహేశ్-రాజమౌళి సినిమా..!

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు సినిమా స్థాయిని ప్రపంచం దృష్టికి స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి తీసుకెళ్లారు. బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి సూపర్ హిట్ పాన్ ఇండియా సినిమాలతో ప్రపంచ బాక్సాఫీస్‌ను ఆయన శాసించాడు. తన రికార్డును తానే అధిగమించే భారీ ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. ఈసారి మహేష్ బాబుతో 'ఎస్ఎస్ఎంబీ 29' సినిమాను తెరకెక్కిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకి సంబంధించి బిగ్ అప్‌డేట్ బయటికొచ్చింది. ప్రముఖ సినీ క్రిటిక్ మనోబాలా తన ఎక్స్ వేదికగా ఈ మూవీ రెండు పార్టులుగా ఉంటుందని చెబుతూనే బడ్జెట్ కూడా రివీల్ చేశారు.

' సూపర్ స్టార్ మహేశ్ బాబు గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ ఫిల్మ్ ఎస్ఎస్ఎంబీ29 భారీ రూ. 1000 కోట్ల బడ్జెట్‌తో రూపొందించబడుతుంది. ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహించనున్న భారతదేశపు అత్యంత ఈ భారీ బడ్జెట్ చిత్రం రెండు భాగాలుగా రూపొందించబడుతుంది..' అంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ కాస్త నెట్టింట ట్రెండ్ అవుతోంది. ఇది చూసిన మహేష్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.



# ప్లాస్టిక్ సర్జరీ వార్తలపై స్పందించిన నయనతార

**బలగం టీవీ, హైదరాబాద్**

తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు గతంలో వచ్చిన వార్తలను నటి నయనతార ఖండించింది. తన ముఖాన్ని మార్చుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించలేదని తెలిపింది. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "నా కను బొమలు అంటే చాలా ఇష్టం. వాటి ఆకారాన్ని ఎప్పుడూ మార్చుకుంటూ ఉంటాను. ప్రతి రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ముందు వీటిని మార్చుతాను. వాటి కోసం ఎంతో సమయాన్ని కేటాయిస్తాను. కనుబొమ్మల ఆకారం మారినప్పుడల్లా నా ముఖంలో మార్పు కనిపిస్తుంది. బహుశా అందుకే నా ఫేస్‌లో మార్పులు వచ్చాయని ప్రజలు అనుకుని ఉండొచ్చు. వాళ్లు అనుకున్నది మాత్రం నిజం కాదు. అలాగే డైటింగ్ వల్ల కూడా నా ముఖంలో మార్పులు రావొచ్చు. ఒక్కో సారి బుగ్గలు వచ్చినట్లు కనిపిస్తాయి. మరోసారి అవి లోపలికి వెళ్లినట్లు కనిపిస్తాయి. కావాలంటే మీరు నన్ను గిచ్చి కూడా చూడొచ్చు. నా శరీరంలో ఎక్కడా ప్లాస్టిక్ ఉండదు" అని నయనతార వివరించింది.